కార్పొరేషన్‌లో ఐఏఎస్‌లకు మంగళం

- కమిషనర్‌గా సత్యనారాయణమూర్తి?
- గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఐఏఎస్‌ల పాలన
- ఆదాయం, అభివృద్ధికి నాటి ప్రభుత్వం పెద్దపీట
- రాజమండ్రి, తిరుపతి కార్పొరేషన్లకు ఐఏఎస్‌ల నియామకం
- కర్నూలులో భర్తీ చేయకపోవడం వెనుక అదే కారణమా..
- టీడీపీ నేతల ఒత్తిళ్లు – నాన్ ఐఏఎస్‌కే మొగ్గు చూపుతున్న ఓ మంత్రి
- నిధులను దోపిడీ చేసేందుకు పక్కా ప్రణాళిక



కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు కార్పొరేషన్‌లో ఐఏఎస్‌లకు మంగళం పాడనుందా? ఇతర కార్పొరేషన్లకు ఐఏఎస్‌లను నియమించి కర్నూలుకు కమిషనర్‌గా ఎవరినీ నియమించకపోవడం వెనుక టీడీపీ నేతల వ్యూహం ఏంటి? నాన్ ఐఏఎస్‌లను నియమించాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారా? ఓ మంత్రి సైతం కమిషనర్‌గా నాన్ ఐఏఎస్‌ను నియమించాలని నిర్ణయించుకున్నారా? ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారా? అంటే అవుననే సమాధానం పలువురు అధికారుల నుంచి వినిపిస్తోంది.

1994లో మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత కర్నూలులో 30 సంవత్సరాలుగా ఎంతో మంది ఐఏఎస్‌ల పాలన నిర్విరామంగా నడిచింది. ఐఏఎస్‌ల పాలనలో నిర్ణయాలు నిక్కచ్చిగా ఉండటం, అభివృద్ధి, సిఫార్సులను తిప్పికొట్టడం, స్వచ్ఛ పాలన అందిస్తారన్న మంచి అభిప్రాయం ఉంది. మరి కర్నూలులో ఇప్పటివరకు ఉన్న సంప్రదాయాన్ని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకపోవడం వెనక తెలుగు తమ్ముళ్ల ఒత్తిళ్లే కారణమా? అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వంలో ఐఏఎస్‌ల నియామకం

గత ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు కర్నూలు కార్పొరేషన్‌లో ఐఏఎస్‌లనే కమిషనర్లుగా నియమించింది. 2020 మే 1 నుంచి 2022 ఏప్రిల్ 2 వరకు ఐఏఎస్ బాలాజీ కమిషనర్‌గా పనిచేశారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మంచి పేరు సాధించారు. శానిటేషన్ నుంచి అన్ని రంగాల్లో కర్నూలు కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపించి స్వచ్ఛతలో మెరుగైన ర్యాంకు తీసుకొచ్చారు. ఆ తరువాత 2022 ఏప్రిల్ 6 నుంచి 2024 జూలై 22 వరకు ఐఏఎస్ భార్గవ్‌తేజ పనిచేశారు. ఆయన హయాంలోనూ కర్నూలు కార్పొరేషన్ అభివృద్ధి సాధించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అభివృద్ధితో పాటు స్వచ్ఛత, పార్కుల అభివృద్ధి, సుందర నగరం, క్లీన్ సిటీ – గ్రీన్ సిటీ, స్ట్రీట్ మార్కెట్లు, స్మార్ట్‌స్ట్రీట్‌లు ఇలా కొత్త కొత్త హంగులతో కర్నూలు రూపురేఖలు మార్చారు. ఐఏఎస్‌ల హోదాలో సిఫార్సులను పక్కన పెట్టి అభివృద్ధిపైన దృష్టి సారించారన్న పేరు ఉంది. అందువల్ల కర్నూలు కార్పొరేషన్‌లో గత ఐదేళ్ల కాలంలో రూ.720 కోట్లు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశారు. వీరిరువురే కాకుండా గతంలో కమిషనర్‌గా ఐఏఎస్ హోదాలో ప్రశాంతి 2018 డిసెంబర్ 28 నుంచి 2019 మే 23 వరకు పనిచేశారు. అలాగే కర్నూలు కమిషనర్లుగా ఐఏఎస్ హోదాల్లో జయలక్ష్మీ, జిల్లా జాయింట్ కలెక్టర్లుగా పనిచేసిన స్మితా సబర్వాల్, హరిప్రీత్ సింగ్, సతీష్ చంద్ర ఇలా ఎంతో మంది పనిచేశారు.

అక్రమాలకు పాల్పడేందుకే ఐఏఎస్‌ను వద్దనుకున్నారా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముగ్గురు ఎమ్మెల్యేలు టీడీపీకి చెందిన వారే ఎంపికయ్యారు. ఇప్పుడు కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించుకుంటే అవినీతి, అక్రమాలకు అవకాశం ఉండదనే అభిప్రాయంతోనే ఇంకా నియామకం జరగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఏడాది రూ.350 కోట్ల వరకు బడ్జెట్ ఉన్న కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు, నామినేషన్ల పనులు, సీ బిల్లుల పేరుతో జనరల్ ఫండ్ నిధులను స్వాహా చేయవచ్చన్న ఉద్దేశమే కారణంగా కనిపిస్తోంది. ప్రజాప్రతినిధుల సిఫార్సులు, ఓ మంత్రి తన అనుచరులకు కావాల్సిన పనులన్నీ నాన్ ఐఏఎస్‌తో చక్కబెట్టవచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇక కర్నూలు కమిషనర్‌గా ఐఏఎస్‌ను నియమిస్తారా? ఇందుకు భిన్నంగా నాన్ ఐఏఎస్‌ను నియమించుకొని తమ పబ్బం గడుపుకుంటారా? అన్నది త్వరలోనే తేలనుంది.

సత్యనారాయణమూర్తికి చాన్స్?

కర్నూలు కార్పొరేషన్‌కు కమిషనర్‌గా సత్యనారాయణమూర్తిని నియమించే అవకాశాలు ఉన్నాయి. నాన్ ఐఏఎస్ క్యాడర్‌లో ఉన్న ఈయన అనంతపురం మున్సిపల్ ప్రాంతీయ సంచాలకులుగా పనిచేస్తున్నారు. గతంలో కర్నూలు కమిషనర్‌గా 2011 అక్టోబర్ 31 నుంచి 2015 మే 31 వరకు పనిచేశారు. ఆయన్ను మళ్లీ తీసుకొచ్చేందుకు ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లాకు చెందిన ఓ మంత్రి మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఇటీవల రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో కమిషనర్లుగా ఐఏఎస్‌లను నియమించిన ప్రభుత్వం కర్నూలుకు మాత్రం ఎవరినీ నియమించలేదు. రాజమండ్రి, తిరుపతి కార్పొరేషన్లలోను ఐఏఎస్‌లను నియమించిన సంగతి విదితమే. ఇక్కడ మాత్రం పోస్టింగ్ ఇవ్వకుండా నాన్ ఐఏఎస్‌లతో భర్తీ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ముగిసిన నామినేషన్ల పర్వం

- స్టాండింగ్ కమిటీకి 15 మంది నామినేషన్ల దాఖలు
- నేడు పరిశీలన

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించి బుధవారం నామినేషన్ల పర్వం ముగిసింది. స్థానిక నగరపాలక కార్యాలయంలో చివరి రోజు పింజరి షాషావలీ (1వ వార్డు, వైఎస్సార్‌సీపీ) షేక్ నీలోఫర్ (6వ వార్డు, టీడీపీ), ఎం.విజయకుమారి (16వ వార్డు, టీడీపీ) ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి స్టాండింగ్ కమిటీకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించారు. గడువు ముగిసే సమయానికి 15 మంది వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్పొరేటర్లు తమ నామినేషన్లు సమర్పించారు. ఐదుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకునేందుకు నిర్వహిస్తున్న ఈ ఎన్నికల్లో విక్రమసింహారెడ్డి, క్రాంతికుమార్, సాంబశివరావు, శివమ్మ, జుబేర్ అహ్మద్, యూనస్‌బాషా, కటారి పల్లవి, జక్కుల రమణమ్మ, మునెమ్మ, మిద్దె చిట్టెమ్మ, షేక్ షాజహాన్ పర్వీన్, షేక్ నీలోఫర్, ఎం.విజయకుమారి నామినేషన్లు దాఖలు పరిచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమిషనర్ మాట్లాడుతూ.. దాఖలైన నామినేషన్లను గురువారం పరిశీలిస్తామని చెప్పారు. ఈ నెల 28వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని చెప్పారు.

పోటీ అనివార్యం

మూడేళ్లుగా నగర పాలక స్టాండింగ్ కమిటీలోని ఐదు స్థానాలను వైఎస్సార్‌సీపీకి చెందిన వారే కైవసం చేసుకునేవారు. ఈ ఏడాది ఎన్నికల్లో టీడీపీ కార్పొరేటర్లు సైతం తన నామినేషన్లు సమర్పించారు. దీంతో పోటీ అనివార్యమైంది.

క్లుప్తంగా

వైద్య విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ ఉమెన్స్ హాస్టల్‌కు అదనపు భవనాలు, పీజీ, ఎస్‌ఆర్ హాస్టల్‌పై అదనపు ఫ్లోర్, యూజీ హాస్టల్‌కు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ కోరారు. ఈ మేరకు ఏపీఎంఎస్ఐడీసీ ఈఈకి ఆమె లేఖ రాశారు. కళాశాలలో 150 మంది యూజీ విద్యార్థుల కోసం వసతి కల్పించేలా హాస్టల్ భవనాన్ని నిర్మించాలన్నారు. కళాశాలలో పీజీ సీట్లు పెరిగిన దృష్ట్యా ప్రస్తుతం ఉన్న పీజీ, ఎస్‌ఆర్ హాస్టల్, ఫ్యామిలీ హాస్టల్ భవనాలపై అదనపు ఫ్లోర్‌ను నిర్మించాలని, అదే విధంగా నూతన ఎగ్జామినేషన్ హాల్ నుంచి యూజీ ఉమెన్స్ హాస్టల్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, వర్షాకాలం అయినందున విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరారు.

దాడులను అరికట్టాలి

కర్నూలు: గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ విన్నవించారు. ఆయన బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. గిరిజనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి న్యాయం జరిగేలా చూడాలని కోరగా ఎస్పీ సానుకూలంగా స్పందించి ఎంతటి వారైనా తప్పు చేస్తే ఊరుకునేది లేదని భరోసా ఇచ్చారు. ఏ ఘటన జరిగినా సత్వరం స్పందిస్తామని హామీ ఇచ్చారు.

ఎస్పీని కలిసిన న్యాయవాదులు



జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసిన న్యాయవాదులు

కర్నూలు (లీగల్): జిల్లా నూతన ఎస్పీ బిందు మాధవ్‌ను బుధవారం ఉదయం ఆయన కార్యాలయంలో కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్ శాఖ, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, న్యాయవాదులు ఉన్నారు.


నేడు 'డయల్ యువర్ డీఎం'

కర్నూలు కల్చరల్: కర్నూలు–2 డిపో పరిధిలోని గ్రామాలకు సంబంధించి ఆర్టీసీ బస్సు రవాణా సమస్యల పరిష్కారానికి సలహాలు స్వీకరించేందుకు డిపో మేనేజర్ బి.సర్దార్‌హుసేన్ గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఏవైనా సమస్యలు ఉన్నా, సూచనలు ఇవ్వాలన్నా నిర్దేశిత సమయంలో 99592 25794 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

కర్నూలు(సెంట్రల్): అటవీశాఖలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ మరణించిన కె.వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అండగా నిలిచింది. బుధవారం వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతదేహానికి నివాళి అర్పించి మట్టి ఖర్చులకోసం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు మగ్బుల్, ఇబ్రహీం, అంజద్, దాదాబాషా, నాగశేషు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలి



మొక్కను నాటుతున్న ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, వలంటీర్లు

కర్నూలు కల్చరల్: కాలుష్య నియంత్రణకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి పిలుపునిచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ కోసం ఒక చెట్టు (మాకే నామ్ ఏక్ పేడ్) కార్యక్రమాన్ని బుధవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, వలంటీర్లు, అధ్యాపకులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..మనకు జన్మనిచ్చిన అమ్మ రుణం తీర్చుకోలేనిదని, అలాగే చెట్లు ప్రపంచానికి ఆక్సిజన్ ఇచ్చి జీవరాసులన్నింటికీ అమ్మలాగే నిస్వార్థ సేవ చేస్తున్నాయన్నారు. కావున చెట్లను పెంచి కాలుష్యాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ జె.హేమంత్, అధ్యాపకులు ఎ.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎ.వెంకటస్వామి, మధుసుధాకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఆర్ కాష్లినాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న కె.రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కర్నూలులోని లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలకు ఒక్కోదానికి రూ.50 కోట్లు కాకుండా ఏడాదికి రూ.700 కోట్లు కేటాయించాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాను సాధిస్తేనే అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా కమ్యూనిస్టు పార్టీలు ప్రజల కోసం పోరాటం చేస్తాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. సీపీఐను ప్రారంభించి వందేళ్లు అవుతున్న సందర్భంగా 2024 డిసెంబర్ 26 నుంచి 2025 డిసెంబర్ 26 వరకు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి నివాళి

కర్నూలు కల్చరల్: అనారోగ్యంతో ఒంగోలులో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిన ఉపాధ్యాయుడు అబ్రహం లింకన్‌కు డీటీఎఫ్ నాయకులు నివాళులర్పించారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీజీ వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రత్నం ఏసేపు, ఓర్వకల్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్, ఉపాధ్యాయులు అల్లాభక్ష్ సుబ్బరాయుడు బుధవారం ఉపాధ్యాయుడి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అబ్రహం లింకన్ మొదట రాయలసీమ క్రిస్టియన్ మోడల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. రెండేళ్ల క్రితం కల్లూరు ముజఫర్ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చాడు. అతనికి భార్యతో పాటు ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె ఒంగోలులోని ప్రైవేటు హాస్పిటల్‌లో డెంటిస్టుగా పనిచేస్తున్నారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ కర్నూలు సిటీ అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షులుగా సేవలందించారు. ఆయన మృతికి డీటీఎఫ్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు సంతాపం తెలిపారు.

టీకాలతో పిల్లలకు రక్షణ



చిన్నారికి టీకా వేయిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): టీకాలు వేయించడం ద్వారా పిల్లలు వ్యాధుల బారిన పడకుండా రక్షణ లభిస్తుందని మాస్ మీడియా అధికారి (డెమో) శ్రీనివాసులు చెప్పారు. బుధవారం స్థానిక డాక్టర్స్ కాలనీలో యూపీహెచ్‌సీ పరిధిలోని 56, 57వ సచివాలయాల్లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భవతులు, పిల్లలకు సమయానుసారంగా వ్యాధినిరోధక టీకాలు వేయాలన్నారు. ఇటీవల వాతావరణంలో మార్పుల వల్ల నీరు కలుషితమై అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, కావున ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగే స్టాప్ డయేరియా కార్యక్రమాల్లో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు నిర్మల, మయూరి, ఆశా కార్యకర్త ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు విమర్శించారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా అవసరం లేదని టీడీపీ, జనసేన పార్టీలు అంగీకరించినట్లు తేటతెల్లమైందన్నారు. రాజధాని కోసం రూ.15 వేల కోట్ల అప్పులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే సంబరాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు పరిహారం ఎంత ఇస్తారో చెప్పలేదని, కేవలం ప్రకటన చేయడంతోనే ఆర్థిక శాఖ మంత్రి సరిపుచ్చిందన్నారు. అలాగే బడ్జెట్‌లో యువతకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని నరేంద్రమోదీ హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రామాంజనేయులు, జే.నాగేశ్వరరావు, సాయిబాబా, ప్రభాకర్, విజయ్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి నాలుగు ఏసీల విరాళం



దాత డాక్టర్ అనుపమ



ఏసీలతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూ రెస్పిరేటరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఆర్ఐసీయూ)కు ప్రవాస భారతీయ వైద్యురాలు అనుపమ వూడర్ల నాలుగు ఏసీలను విరాళంగా ఇచ్చారు. అమెరికాలో స్థిరపడిన ఆమె 1988 బ్యాచ్ కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థిని. ఆమె తల్లి పసల రెడ్డెమ్మ జ్ఞాపకార్థం ఏసీలను విరాళంగా అందించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇదే ఆర్ఐసీయూ భవనానికి ఇటీవల 1964 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ రంగారెడ్డి ఈ నెల 22న రూ.12 లక్షల వైద్య పరికరాలను విరాళంగా అందజేశారన్నారు. అలాగే ఈ నెల 3న ప్రవాస భారతీయ వైద్యుడు చామర్తి సుబ్బారావు (కేఎంసీ 1971 బ్యాచ్) ఈసీజీ త్రీ ఛానల్ మిషన్‌ను విరాళంగా అందజేశారన్నారు. ఆసుపత్రికి ఎవ్వరైనా వైద్య పరికరాలను విరాళం రూపంలో అందించవచ్చని ఆయన కోరారు.

నాయకత్వ లక్షణాలు మెరుగుపర్చుకోవాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు గొప్ప నాయకులను స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ జోబీ ఫిలిప్స్ సూచించారు. స్థానిక మాధవ నగర్‌లోని నారాయణ పాఠశాలలో బుధవారం ఏజీఎం రమేష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జోబీ ఫిలిప్ మాట్లాడుతూ.. ప్రతివ్యక్తిలో నాయకత్వ లక్షణాలు ఉంటాయని, వాటిని తరచుగా బహిర్గతం చేయాలన్నారు. పిల్లల బలాలు, బలహీనతలపై తల్లిదండ్రులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. నాయకత్వానికి జరిపిన మాక్ ఎలక్షన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు అతిథి చేతుల మీదుగా బ్యాడ్జీలు అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 10, 11 తేదీల్లో చిత్తూరు జిల్లా కుప్పంలో నిర్వహించనున్న 7వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అంతర్ జిల్లాల షూటింగ్‌బాల్ పోటీల్లో రాణించాలని డీఎస్‌డీఓ భూపతిరావు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. బుధవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో షూటింగ్ బాల్ క్రీడాంశంలో జిల్లాస్థాయి బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురాతన క్రీడ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖచే గుర్తింపు ఉన్న ఈ క్రీడలో అంచెలంచెలుగా ఎదగాలని సూచించారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పరశురాముడు మాట్లాడుతూ.. ఎంపిక పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 12 బాలుర జట్లు, 10 బాలికల జట్లు పాల్గొన్నాయన్నారు. ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతిచెందిన అబ్దుల్లా

కర్నూలు: కర్నూలు పాత బస్తీకి చెందిన అబ్దుల్లా (55) యాసిడ్ తాగి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం తెల్లవారు జామున మృతిచెందాడు. మంగళవారం అర్ధరాత్రి ఇంటి నుంచి సైకిల్‌పై రైల్వేస్టేషన్ చేరుకుని యాసిడ్ తాగి రైలు పట్టాలపై పడుకుని ఉండగా స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ సిబ్బంది అబ్దుల్లాను తీసుకెళ్లి ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందాడు. కర్నూలు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి



అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి ఘనంగా జరిగింది. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జరిగిన కార్యక్రమంలో అయ్యంకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథపాలకులు పెద్దక్క మాట్లాడుతూ.. గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేసిన అయ్యంకి మొట్టమొదటి గ్రంథాలయ స్థాపకుడన్నారు. గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను ఏర్పాటు చేసి గ్రంథాలయ ఉద్యమాన్ని కొనసాగించాడన్నారు. నేషనల్ లైబ్రరీ వీక్స్ నిర్వహించడానికి ఎంతగానో కృషి చేశాడని కొనియాడారు. గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

రూ.10 వేల కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): మెప్మాలో ఆర్‌పీ (రిసోర్స్ పర్సన్)లుగా పనిచేస్తున్న వారికి పనితో సంబంధం లేకుండా రూ.10 వేల వేతనం ఇవ్వాలని ఆర్‌పీల సంఘం గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో బుధవారం మెప్మా ఆర్‌పీల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెప్మా ఉద్యోగుల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన సమయాల్లో విధుల్లోంచి తొలగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్స



ఆపరేషన్ చేయించుకున్న వృద్ధుడితో డాక్టర్ నాగేంద్రప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): గుండె కవాటాల్లో పేరుకుపోయిన క్యాల్షియంను అత్యాధునిక రోటాబ్లేషన్ చికిత్స ద్వారా వైద్యులు విజయవంతంగా తొలగించారు. చికిత్స వివరాలను కర్నూలు కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ నాగేంద్రప్రసాద్ వివరించారు. 73 ఏళ్ల వృద్ధుడిని గుండెపోటుతో ఆస్పత్రికి తీసుకురావడంతో పరీక్షలు చేసి గుండె కవాటంలో క్యాల్షియం పేరుకుపోయినట్లు గుర్తించామన్నారు. అతని వయస్సు, ఆరోగ్య సమస్యల దృష్ట్యా యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ చేయడం కుదరదని చెప్పారు. అత్యాధునిక రోటోప్రో రోటాబ్లేషన్ చికిత్స ద్వారా అత్యంత కచ్చితత్వంతో గుండె కవాటాల్లో పూడికను తొలగించినట్లు వివరించారు. ఈ విధానంలో ప్రొసీజర్ చేసే సమయం, ఫ్లోరోస్కోపీ సమయం, కాంట్రాస్ట్ పరిమాణం, రేడియేషన్ డోస్ అన్నీ తగ్గుతాయని, మెరుగైన ఫలితాలు ఉంటాయని వెల్లడించారు. బాధితుడు కోలుకుంటున్నట్లు చెప్పారు.

సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల ప్రమాదాన్ని వివరించి ఆరోగ్య సూత్రాలు పాటించేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. మండలంలోని ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, పూడిచెర్ల, కేతవరం గ్రామాలలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా గ్రామాలలో కలియతిరిగిన పీడీ పరసరాల శుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. రోడ్లపై నీటి నిల్వ ఉండకుండా చూడాలని, మురుగు కాల్వలల్లో ఎప్పటికప్పుడు పూడిక తొలింపు చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మురుగు నిల్వ మూలంగా దోమల ఉత్పత్తి జరుగుతుందని, మలేరియా, అతిసార, టైఫాయిడ్, డెంగీ తదితర విషజ్వరాలు విజృంభిస్తాయనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, తహసీల్దార్ నటరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ రామయ్య, ఏపీఓ కుమార్‌సాయినాథ్, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): విద్యుత్ సబ్ స్టేషన్లలో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. 11 కేవీ మౌర్యా ఇన్ ఫీడర్ పరిధిలోని బంగారుపేట, సిటీ స్క్వేర్ మాల్, ఆనంద్ థియేటర్, శ్రీనివాస థియేటర్ పరిసరాలు, 11 కేవీ ఉడ్ ల్యాండ్ ఫీడర్ పరిధిలోని రివర్‌వ్యూ కాలనీ, మెన్స్ హాస్టల్, గౌరీగోపాల్ హాస్పిటల్, సుశీల నేత్రాలయ, హబీబ్ ముబారక్ నగర్, తదితర ప్రాంతాలు, 11 కేవీ ఎస్ఆర్‌పేట ఫీడర్ పరిధిలోని సంకల్‌బాగ్, ఎన్ఆర్ పేట, కొత్తపేట, ఎస్వీ కాంప్లెక్స్, గిప్సన్ కాలనీ, మున్సిపల్ ఆఫీస్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రెండు కంకర లారీలు సీజ్

కర్నూలు (టౌన్): కల్లూరు మండలం ఉలిందకొండ వద్ద అక్రమంగా కంకర రాళ్లను తరలిస్తున్న రెండు లారీలను గనుల శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనుమతి లేకుండా కంకరను తరలిస్తున్న లారీలను సీజ్ చేసి ఒక్కో లారీకి రూ.11 వేల ప్రకారం రూ.22 వేలు జరిమానా విధించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ బుధవారం వెల్లడించారు. ఈ దాడుల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నారు.